

# మూడో సీతకథ

బ్రాహ్మణ పిల్ల

– భువనచంద్ర



(గత సంచిక తరువాయి)

**దారాసింగ్ - కింగ్‌కాంగ్**

లోకం కొత్తగా ఉంది. నా శరీరం నాకే కొత్తగా ఉంది. అదేమిటో, సన్నగా ఉండేదాన్ని కాస్తా కొంచెం కొంచెం పుష్టిగా తయారవడం నాకే తెలుస్తోంది. ఇక తోటి స్నేహితుల/స్నేహితురాళ్ళ చూపులైతే చిత్రవిచిత్రంగా మారుతున్నాయి. ఓసారి అప్రయత్నంగా 'పాకబడి బేచ్' కబాడీ ఆడుతుంటే ఉత్సాహంగా అటువెళ్ళాను.

"నేను కూడా ఆడతాన్రా!" అన్నాను పార్వతీశంగాడితో. అందరూ నోరు వెళ్ళబెట్టారు. మధుగాడయితే, "నువ్వు ఆడకూడదు సీతా... ముఖ్యంగా మగాళ్ళతో" అన్నాడు.

"అదేంట్రా?" అన్నాను.

"అదంతే.. నీకు తెలీదుగదూ, మా అమ్మ కూడా నువ్వు పెద్దమనిషి అయ్యావని చెబితే, ఇకనించీ మేము నిన్ను 'ఒసేయ్, ఒసేయ్ అనీ, ఏమే, ఏమిటే అనీ పిలవకూడ'దని చెప్పింది. పెద్దమనిషి అయిన ఆడపిల్లలతో, వాళ్ళు ఎంత ప్రాణస్నేహితులైనా దూరంగా ఉండాలని చెప్పింది" అని చెప్పాడు.

గొడవపెట్టి అయినా ఆడాలని అనిపించిందిగానీ, సడన్‌గా నన్ను నేను చూసుకుని ఆగిపోయాను. మాట్లాడకుండా వెనక్కి వచ్చేశా.

"ఇదిగో సీతా.... దబ్బకాయ పచ్చడి పెట్టానుగానీ, తీసికెళ్ళు..దా" అని పిలిచింది కరణం మామ్మగారు.

చిత్రం ఏమంటే తమ్మిలేటి విషయం జరిగినదగ్గర్నించీ నేనెవరితోనూ అదివరకులా అల్లరి చిల్లరగా ఉండలేకపోతున్నా. ఆఖరికి మా అమ్మతోకూడా. అదివరకైతే కావాలని మరీ ఆవిడ్ని విసిగించేదాన్ని. ఇప్పుడావిడ నిజంగా విసుక్కుంటున్నా, నాకు కోపం రావట్లేదు సరికదా, 'ఆట' కూడ పట్టించాలనిపించడంలేదు.

ఇతరుల్లోని 'పెద్దరికాన్ని' గుర్తించడమేనేమో 'పెద్దమనిషి' అవడం అంటే!

"నాకు నేర్పుతారా ఎలా పెట్టాలో?" అడిగాను.

"ఎందుకు నేర్పనే, అట్లా చూసి ఇట్లా నేర్చుకోగల పిల్లవి నువ్వు. అయినా, చిన్నప్పుడు ఎంత అల్లరి చేస్తే పెద్దయ్యాక అంత బుద్ధిమంతులవుతారుట. నువ్వే దానికి ఉదాహరణ. దా.. లోపలికి రా." అంటూ లోపలికి తీసికెళ్ళి రెండు అరిసెలూ ఓ పెద్ద జంతికా ప్లేట్లో పెట్టిచ్చి, నీళ్ళగ్లాసుకూడా చేతికిచ్చి నువ్వు తినమ్మా.. మధ్యాహ్నం ఎప్పుడు తిన్నావో ఏమో?" అని, తను ఓ పాత హార్లిక్సు బాటిల్లో దబ్బావకాయ నింపింది.

'ఇప్పుడయితే ఇలా తింటున్నాంగానీ, యీవిడ్ని ఎంత ఏడిపించానూ' అని అనుకుంటే నవ్వొచ్చింది.

"సీత ఎలావుంది మామ్మగారూ!" అనడిగాను అరిసె ముక్క కొరుకుతూ. టిఫిన్లు అన్నింటిలోకీ అతి కష్టమయినది అరిసె. ఏ మాత్రం పాకం తప్పినా అది 'పళ్ళ'కి ఇబ్బంది పెడుతుంది. నూనెలో వేయించేటప్పుడు కూడా 'వేడి'లో ఎక్కువ తక్కువలు

ఉండకూడదు. చాలాచాలా జాగ్రత్తలు తీసుకోవాలి అరిసెల తయారీలో. కరణం మామ్మగారు నిజంగా ఎక్స్‌పర్ట్. కరకరలాడుతూనే కరిగిపోతున్నాయి అరిసెముక్కలు. నువ్వులు అద్దడం వల్ల రుచి ఇంకా పెరిగింది. ‘తీపి‘ కూడా సరిసమానంగా ఉంది.

"ఏం చెప్పనే! మనింటి దగ్గర ఉన్నంతవరకే ఆడపిల్ల. పెళ్ళి చేసి పంపాక మన చేతుల్లో ఏవుంది? అమ్మా, ఆడపుట్టుక పుట్టడం అనేది జీవులు చేసిన పాపం. పుట్టినచోట పుట్టినట్టూ ఉండనివ్వరు. మెట్టినచోట మెట్టినట్టూ ఉండనివ్వరు. అన్నిటికీ అడ్డంకులే.. అందరికీ అహంకారాలే. అత్తగారినని ఒకతె, ఆడబిడ్డనని ఒకతె.. దేవుడా... ఆడవాళ్ళే ఆడదాని కళ్ళల్లోంచి కన్నీళ్ళు కార్పించేది. ఏం చేస్తాం. ఎప్పుడో ఒకప్పుడు పెళ్ళిచేసి పంపాల్సిందే కదా. కలకాలం పుట్టింటిలోనే ఉంచుకున్నా చుట్టుపక్కల ఆడవాళ్ళు ఊరుకుంటారా? కాకుల్లా పొడవరూ? ‘అత్తవారింట్లో అణిగిమణిగి వుండాలమ్మా అంటూ ఎన్ని శ్రీరంగనీతులు ఒలకబోస్తారో!" సుదీర్ఘంగా నిట్టూర్చింది కరణం మామ్మగారు.

"అంటే?" అని అడగబోయా ఆగిపోయా. సీత పేరు ఎత్తగానే ఆవిడ మొహం ఓ చెప్పలేని బాధతో వాడింది. ఇంకా ప్రశ్నలడిగి బాధించడం నాకు మంచిదనిపించలేదు.

"ఒసేయ్ అమ్మాయ్.. నేనూ నీలాగే పుట్టాను. ఇదిగో మానుకో, పుట్టకో, తాబేళ్ళకో వచ్చినట్టు ఇన్నేళ్ళ వయసొచ్చింది. బ్రతుకంతా పరాధీనమే. నేను నాలా బ్రతికిన క్షణాలు ఇన్నేళ్ళలో ‘ఎన్ని‘ అని లెక్కవేసుకుంటే ఒక్కటి కూడా కనిపించదు. నా కంటే నా కూతుళ్ళు కోడళ్ళూ కాస్త నయం. మళ్ళీ మనవరాలి సంగతి చూస్తే, అదో అమాయకపుది. సుఖమో దుఃఖమో కూడా దానికి తెలుస్తుందని నేను అనుకోను. సీతా, ఇంట్లో ఎవరూ లేరు. గుండెల్లో గూడుకట్టుకున్న బాధని వెళ్ళబోసుకుని నీకు బాధ కలిగిస్తున్నానేమో.. ఏమీ అనుకోకమ్మా.." చెమ్మగిల్లిన కళ్ళని తుడుచుకుంటూ అన్నది కరణం మామ్మగారు.

"మీకెవరూ స్నేహితుల్లేరా మామ్మగారూ.!?" టాపిక్ మారుద్దామని అన్నాను నేను.

‘కమల‘ అనే అమ్మాయుండేది. మన కులం కాదనుకో. అయినా ఓ మాట చెప్పనా. ఏ వుందే యీ కులాల్లో. ఏ కులమైనా ఆడదాని బతుకు అణిగిమణిగి పడివుండాల్సిన బతుకే. ఇతర కులాల్లో అయితే, ఇంత నిక్రుష్టపు బతుకు ఉండదు. మనకన్నా వందరెట్లు మంచిగా ఉంటుంది. నోరెత్తి మాట్లాడే అవకాశమున్నా ఉంటుంది. ఇక్కడేం చచ్చింది? మడీ దడీ అంటూ ప్రాణాలు తియ్యడం, అది అలాకాదు - ఇది ఇలాకాదూ అంటూ ఏడిపించుకు తినడం, పోనీ తల్లిదండ్రుల్తో మొరపెట్టుకున్నా వాళ్ళేమంటారూ? పిచ్చవేషాలు వెయ్యక చచ్చినట్టు పడివుండమంటారు. నీకు తెలుసా.. నాకు ఇద్దరు అన్నలూ ఇద్దరు అక్కలు. పెళ్ళయిన రెండేళ్ళు మాత్రం పుట్టింటికి ఓ వారం రోజులపాటు పోనిచ్చారు. మరో రెండేళ్ళు మా అమ్మా నాన్నా వచ్చారు. అంతే.. మళ్ళీ యీనాటి వరకూ ఆ గడప తొక్కితే ఒట్టు. ఏడోఏట అయింది నా పెళ్ళి. ఏడుస్తూ ఉన్నా సరే, పీటలమీద కూర్చోబెట్టి పెళ్ళిచేశారు. అప్పటి ఏడుపు ఇప్పటికీ తగ్గలేదే అప్పుడు కన్నీళ్ళు బయటికొచ్చేవి. కానీ సీతా ఇప్పుడు అవి ఇంకిపోయాయి. " మౌనంగా కూర్చున్నది కరణం మామ్మగారు. నా కళ్ళల్లో చెమ్మ.

ఆవిడ్ని ఏడిపించడమేగానీ, ఆవిడ జీవితం గురించి నాకేమి తెలుసూ? అప్రయత్నంగా ఆవిడ దగ్గరికెళ్ళి కావలించుకున్నాను. గంగానది ఎలా ప్రవహిస్తుందో అవాళ తెలిసింది.

"సార్.. ఏమైనా సరే.. వాలీబాల్, రింగ్ టెన్నిస్‌లాంటి ఆటల్లో ఆడపిల్లలకీ ప్రాధాన్యత ఇవ్వాల్సిందే ఎక్సర్‌సైజ్ మాకూ కావాలిగా. నాకైతే అసలు ఓ గాల్స్ కబాడీ టీమ్ తయారు చెయ్యాలని ఉంది" అన్నాను. 4th ఫారంకొచ్చిన కొత్తలో.

"బాగుంది. కబాడీ సంగతి పక్కన పెడితే, రేపే మీకో సెపరేట్ కోర్టు వాలీబాల్‌కీ, రింగ్ టెన్నీసులకీ ఏర్పాటు చేస్తాను. కానీ ముందు హెచ్.ఎమ్ గారి పర్మిషన్ తీసుకోవాలి.' మమ్మల్ని ఎంకరేజ్ చేస్తూ అన్నారు వేదాంతాచార్యులుగారు. నేను, విజయలక్ష్మి, జయలక్ష్మి, సరస్వతి, పుష్పకుమారి, కమల, కోటగిరి భారతి, హైమావతి, సరోజినీ, సత్యవతి అందరం గుంపుగా వెళ్ళి అడిగాము.

'శారీరక ఆరోగ్యం బాగున్ననాడే మానసిక ఆరోగ్యం బాగుంటుందని' ఆ రెండూ బాగున్ననాడే పైపైకి ఎదగగలమనీ మల్లయుద్ధ వీరుడు దారాసింగ్ అన్నట్టు అంతకుముందురోజే పేపర్లో చదివాను. అన్నట్టు యీ విషయం మీకు చెప్పలేదు గదూ, దారాసింగ్ రణధవాజిజ్జా, కింగ్ కాంగ్ ఇలా బ్రహ్మాండమైన వస్తాదులు 'కుస్తీ' పోటీల్లో పాల్గొంటున్న వివరాలు రోజూ పేపర్లలో వస్తున్నై. అంతేకాదు, ఓ 'ముసుగువీరుడు' కూడా పోటీల్లో దిగుతాడుట. ఇంతవరకూ అతన్ని ప్రపంచంలోనే ఎవరూ ఓడించలేదుట. ఓడేవరకూ ముసుగు తియ్యడట.

ఇలా 'ట' కారాలు ప్రజల నోళ్ళల్లో తెగనానాయి. అసలు కింగ్‌కాంగ్ దెబ్బకి చాలామంది భీకర వస్తాదులు మల్లయుద్ధబరిలోనే మట్టి కరిచారనీ, బక్క దారాసింగ్ మాత్రమే కింగ్‌కాంగ్‌ని చిత్తుచేశాడనీ బ్రహ్మాండమైన పబ్లిసిటీ జరుగుతోంది. దండమూడి రాజగోపాల్, నెల్లూరు కాంతారావు, అర్జాజనార్ధనరావుగార్ల గురించి కూడా కొంచెం కొంచెం పేపర్లో రావడం మొదలైంది.

"సీతా మేమందరం ఏలూరు పోతున్నాం. దారాసింగ్, కింగ్‌కాంగ్ పోటీ వుందిట" బిడియంతో కూడిన చనువుతో అన్నాడు పార్వతీశం.

"ఎవరెవరూ?" అన్నాను. "జోగారావూ, నేనూ, మద్దమత్తినోడూ, బర్మాబిజ్జా, పరిమి త్యాగరాజూ అందరం" అన్నాడు.

"ఇంట్లో చెప్పావా?" నవ్వుతూ అన్నాను. నాకు తెలీకుండానే పెద్దరికంతో అడిగానని నాకే అనిపించింది. ఆడవాళ్ళు ఎదిగినంత తొందరగా మగవాళ్ళు మానసికంగా ఎదగరేమో!

"చెబితే తాట వొలుస్తారు" నవ్వాడు పార్వతీశం.

"తరవాత తెలిస్తే?"

"చూసొచ్చాక తాట తీసినా ఫరవాలేదుగా!" మళ్ళీ నవ్వాడు వాడు. వాడి నవ్వులో పెద్దాళ్ళని చీట్ చేస్తున్నాననే గర్వమూ కొంటెతనమూ ఉన్నాయి.

బహుశా నాలోనూ అదే గర్వమూ కొంటెతనమూ ఉండేవేమో. అల్లరి చేసినప్పుడు.

"ఏంటి ఆలోచిస్తున్నావూ? నువ్వురావా? వస్తానంటే అందరం కలిసేపోదాం" అన్నాడు.

"మరి టిక్కెట్ల డబ్బు? అన్నిటికంటే తక్కువది ఐదురూపాయలని వేశారుగా!" అన్నాను.

"తరువాత తిరిగిచ్చే పద్ధతిలో మద్దిమత్తెనోడు చూస్తానన్నాడు" దిలాసాగా అన్నాడు పార్వతీశం.

"నాన్నా ఏలూర్లో దారాసింగ్ కింగ్‌కాంగ్ పోటీలున్నాయట చూద్దామా..?" అనడిగా ఆ రాత్రి. నావంక విచిత్రంగా చూశాడు మా నాన్న. పెద్దమనిషినయ్యాక ఇంతవరకూ ఆయన్ని ఏదీ అడగలా. ఇప్పుడు అడగటం ఆయనకి చిత్రంగా అనిపించి ఉండొచ్చు.

"ఆహా.! నువ్వు అడగడమూ, ఆయన కాదనడమూ వుంటుందా! పెద్దకుస్తీ పోటీలు చూడాలిట. ఆడవస్తాదు బయల్దేరింది" చిమచిమలాడుతూ అన్నది మా అమ్మ.

"దొంగతనంగా వినేవయినా సరిగా వినవే పెదపాడు మాలక్ష్మి కూతురా.. కుస్తీపోటీలు జరిగేది ఏలూర్లో.. సరిగ్గా విను.. ఏలూర్లో" అన్నాను. మా అమ్మ మొహం లక్ష కేండిల్ బల్బ్‌లా వెలిగిపోయింది.

"చెప్పవేం మరీ.! మీతోపాటు నేనూ వస్తా.. అబ్బ. మావాళ్ళని చూసి ఎన్నాళ్ళయిందో!" మురుసుకుంటూ అంది మా అమ్మ, ఫక్కున నవ్వాడు మా నాన్న. "ఎంతకాలమైందే సీతా నువ్వు మీ అమ్మని అలా పిలిచీ!?" అని అన్నాడు.

"అసలు ఏలూరు ప్రోగ్రాం వేసిందే అమ్మకోసం నాన్నా. మనకెట్లాగూ చుట్టాలు లేరుకదా.. పాపం అమ్మకయినా వాళ్ళవాళ్ళని చూసుకోవాలని అనిపించదూ!" కావాలనే మా అమ్మ భుజాలు పట్టుకుని అన్నాను. ఆవిడ వెనకాల నిలబడితే, ఆవిడ తల నా ఛాతీకి తగులుతోంది. మా అమ్మ అంత పొట్టిగా అనిపించింది.

"నా తల్లే! ఏమయినా నీకు పెద్దరికం వచ్చిందే. అన్నీ చక్కగా ఆలోచించగలుగుతున్నావు. అవునూ ఏమిటబ్బా మర్చిపోయానూ.!" అంటూ వంటింట్లోకి వెళ్ళింది మా అమ్మ. "నాన్నా.. ఇక చూస్కో.. ఇవ్వాళ మనకి విందు భోజనమే!" మా నాన్న పక్కనే కూర్చుని మెల్లగా అన్నాను.

ఆయన మెల్లగా నవ్వి నా తల నిమిరాడు. తండ్రిప్రేమ ఎంత గొప్పదీ.! అదెప్పుడూ చలికాలంలో గంగానదిలా ప్రవహిస్తుంది చల్లగా.. మెల్లగా.

నిజంగా ఆ రాత్రి విందు భోజనమే. బెండకాయ కాయలికి కాయలుగా పొట్టచీల్చి శనగపిండీ, జీలకర్రా దట్టించి, కాయలకి కాయలుగా వేయించిన కూరా, పచ్చిపులుసూ, మాంఛి ఇంగువ పోపు పెట్టిన పండుమిరపకాయల పచ్చడీ.. గడ్డపెరుగూ. ఇంకేం కావాలి అన్నవరం సత్యనారాయణా!!

***గోల్‌మాల్.. తప్పింది...***

తీరా ఏలూరు వెడితే ఏముంది! టిక్కెట్లు అమ్మినవాళ్ళు గాయబ్. ఏజంట్లందరూ ఎవరిదారిన వాళ్ళు చెక్కేస్తే ఆర్గనైజర్లు లబోదిబోమంటున్నారు. అదీగాక, దారాసింగ్ కింగ్‌కాంగ్‌ల టూర్‌లో కూడా ఏదో చిన్నమార్పు వచ్చిందిట. పెద్దాయన (ఆర్గనైజర్స్‌తో) అన్నాడు.

"అయ్యా.. ఎవరెవరైతే టిక్కెట్లు కొన్నారో, అతి త్వరలోనే మళ్ళీ వారి కుస్తీపోటీ ఏర్పాటు చేసి, ఇవే టిక్కెట్ల మీద ప్రవేశం కల్పిస్తా, అంతవరకు నన్ను క్షమించండి. మీ సొమ్ము కాజేద్దామనే ఉద్దేశ్యం నాకు లేదు" అని చేతులు జోడించాడు.

నిజంగా అవి సత్తెకాలపు రోజులే. న్యాయానికి నిజంగా విలువుండేది. రెణ్ణెల్ల తరవాత కుస్తీపోటీ ఏర్పాటు చేశారు. దారాసింగ్ సోదరుడు 'రణధవా' కూడా పాల్గొన్నాడు.

'దారాసింగ్ రణధవాలు ఇద్దరూ మల్ల యోధులే. ఇద్దరూ సినీనటులయ్యారు. దారాసింగ్ అయితే ఏకంగా నిర్మాత, దర్శకుడు, రచయిత, హీరో, ఇన్ని పాత్రల్ని ఒంటిచేత్తో పోషించడమేకాక దారా స్టూడియో ఓనర్ కూడా అయ్యాడు. కామన్వెల్త్ పోటీల్లో ప్రపంచ మల్లయోధుల్ని ఓడించి 'రుస్తమ్ - ఎ - హింద్' టైటిల్ని స్వంతం చేసుకోవడమేగాక, ప్రపంచ మల్లఛాంపియన్ షిప్‌ని కూడా గెల్చుకున్నాడు. ఆరడుగుల రెండంగుళాల అద్భుతమైన శరీరం, 53 అంగుళాల ఛాతీ, 147 కిలోల బరువుతో గ్రీకు శిల్పంలా ఉండేవాడు. తరవాత్తరవాత టివి సీరియల్స్‌లో కూడా యాక్ట్ చేశాడు రామానందసాగర్ తీసిన 'రామాయణం'లో హనుమంతుడి పాత్ర ధరించి ప్రజాహృదయాల్లో చిరంజీవిగా నిలిచిపోయాడు. రాజ్యసభకు నామినేట్ కాబడ్డ భారాలు దేశపు మొట్టమొదటి క్రీడాకారుడు దారాసింగే. ముంతాజ్ అనే హీరోయిన్‌తో పదహారు సినిమాలు హీరోగా, వరసగా నటించిన రికార్డు కూడా దారాసింగ్‌దే ఆ తరవాత ముంతాజ్ చాలా గొప్ప హీరోయిన్‌గా పేరు తెచ్చుకుంది. శంకరాభరణం సినిమా చూసి తల్లిదండ్రులు తమ పిల్లలకు సంగీతం నేర్పించినట్లు, దారాసింగ్ కుస్తీపోటీల్ని చూసి చాలామంది పంజాబీలూ హరియాణా జాట్‌లూ తమ పిల్లలకు మల్లయుద్ధం నేర్పించారు ఆ రోజుల్లో. దేహదారుఢ్యానికి ఇండియన్ ఐకాన్ దారాసింగ్. "ద ఐరన్ మేన్ ఆఫ్ ఇండియన్ సినిమా' అనే బిరుదుపొందిన అద్భుత మల్లయుద్ధ యోధుడు దారాసింగ్. దారాసింగ్ X కింగ్‌కాంగ్ అంటే, స్టేడియం మొత్తం నిండిపోయేది. ఎవరు గెలుస్తారూ అనేది సస్పెన్స్. కోడిపందాల్లో పందాలు వేసినట్టు జనాలు పందాలు వేసుకునేవారు. కింగ్‌కాంగ్ ది దారాసింగ్ కంటే భారీ శరీరం. చిన్న తలకాయి. పెద్ద

గుమ్మడికాయి మీద వెలక్కాయ పెట్టినట్టుండేది అతని తలకాయ. అంత మహాకాయుడూ మట్టికలిచేవాడు, దారాసింగ్ 'కత్తెరపట్టుకి' దాసోహం అంటూ!

మా హైస్కూల్లో బాలికుల కోసం ప్రత్యేక రింగ్ టెన్నిస్ పోటీలు జరిగాయి. మొదట్లో ఆ ఆటమీద నాకంత 'పట్టు' లేదు. కబాడి అంటే ఇష్టం. అదేమో చిన్నప్పటినించీ ఆడిన ఆటాయే. అయితే, మొదటిసారి జరిగిన పోటీల్లో ఓడిపోయినా, రెండోసారి జరిగిన 'సింగిల్స్' పోటీలో 'శిరీష'ని గెలిచాను. శిరీష ఓ విధంగా పట్నం పిల్ల. వాళ్ళనాన్నగారేమో పేద్ద ఆఫీసరు. అదీగాక గవర్నమెంటు వారికిచ్చిన బంగ్లాలోనే బ్యాట్మింటన్ కోర్టు ఉన్నదాయే. రోజూ వాళ్ళ నాన్నగారితో బాల్బ్యాట్మెంట్, రింగ్ టెన్నీస్ ఆడుతుందిట. గెలవడంలో విచిత్రం ఏముందీ!

"సాధించావు మొత్తానికి" అన్నది ఎస్.ఎస్.ఎల్.సి చదివే మణి.

"బాస్కెట్ బాల్ వస్తేనే సాధించినట్టు" నేనన్నాను. మా కస్తూరి టీచర్, వేదాంతాచార్యులుగారి సపోర్టు వల్ల మొత్తానికి మాకూ విడిగా కోర్టేకాక, నెట్, రెండు వాలీబాల్స్ అరేంజ్ చేశారు హెడ్మాస్టారు. వచ్చినరోజునించే మేం ప్రాక్టీసు మొదలెట్టాం.

ఓ పక్క చదువు, మరో పక్క గేమ్స్తో రోజులు ఇట్టే గడిచిపోతున్నాయి.

"ఏమ్మా యీ మధ్య జనాలకి ఉత్తరాలు వ్రాయడం మానేశావూ!?" అడిగారు పోస్టు మేస్టారు ఓ రోజున. సమాధానం చెప్పలేక నాలుక్కరుచుకున్నా. కొంత సమయమైనా కేటాయించాలని నిర్ణయించుకున్నాను.

అప్పటికింకా 'వయోజనవిద్య' ప్రోగ్రామ్ వున్నా ఎందుకో అదంత ప్రాముఖ్యత పొందలేదు. పేరుకి ఎవర్నో టీచరుగా వేసేవారు అంతే. ఆ జీతంలో టీచరుకి ముట్టేదెంతో దేవుడికే తెలియాలి. మెల్లమెల్లగా లోకానికి సంబంధించిన మర్మాలు అర్థమవుతున్నాయి.

"నాన్నా, ఇన్ని మోసాలు జరుగుతున్నా ప్రభుత్వం ఏమీపట్టనట్టు ఎలా ఊరుకుంటోందీ?" అడిగాను ఓ రోజు.

"ప్రజలచేత, ప్రజలకొరకు ప్రజలనించే ఏర్పడ్డ ప్రభుత్వం కదమ్మా మనది. ప్రభుత్వ ప్రతినిధులు ఎవరూ? మనకి తెలిసిన మనం ఎన్నుకున్న వాళ్ళేగా! సమర్థుల్నీ, ప్రజాహితం కోరుకునే వాళ్ళనీ ఎన్నుకుంటే డెమోక్రసీ అంత గొప్పది లేదు. అసమర్థులని పరిపాలన మీద ఏమాత్రం అవగాహన లేనివాళ్ళని ఎన్నుకుంటే ఏమవుతుందీ? ఇదిగో ఇప్పుడు జరుగుతున్నదే ఎప్పటికీ జరుగుతుంది" నిట్టూర్చి అన్నాడు నాన్న.

ఆ రాత్రి కలొచ్చింది.. నేనో పెద్ద నాయకురాల్ని అయిపోయినట్టూ నా నాయకత్వంలో ప్రపంచం అంతా సజావుగా సాగుతున్నట్టూ. మెలుకువతో ఉన్నప్పుడు కన్నా ఊహలే నిద్రించేటప్పుడు కలలుగా రూపాంతరం చెందుతాయేమో!

ఓ పక్క రేక్కాయిలు, మరో పక్క తేగలు, మరోపక్క పరిక్కాయలూ, ఇంకో పక్క 'కుమ్ము'లో కాల్చిన చిలకడదుంపలూ, ఆపైన మాంఛి నషాళానికెక్కే మసాళా నింపిన మిర్చిబజ్జీలు ఇంకేం కావాలీ.. శీతాకాలానికి 'పచ్చిమిర్చి బజ్జీలకి చెలికత్తెల్లా అటు పక్క అరిటి బజ్జీలు - ఇటు బంగాళాదుంప బజ్జీలూ - మధ్య మధ్యలో నమలడానికి బఠానీలూ, జంతికలు, పంచదార పూరీలూ, ఇవన్నీ మనచుట్టూ చేరి కన్ను కొడుతుంటే, చలి పారిపోక ఏం చేస్తుందీ!

ఈ సీతకి యీ తిండిరంధి ఏమిటా అని మీరు అనుకోవచ్చు. అసలు మా సూర్యకాంతం తినేదాంట్లో నేను తినేది పదోవంతయినా ఉంటుందా? ఇంతకీ యీ సూర్యకాంతం ఎవరంటారా? కొత్తగా నా ఫ్రెండ్స్ లిస్టులో చేరిన అమ్మాయి. వాళ్ళ నాన్నగారికి మా ఊరికే ట్రాన్స్ఫర్ అయింది. బి.డి.ఓ ఆఫీసులో ఆయన గుమాస్తా. సూర్యకాంతం ఎత్తు అయిదడుగుల ఏడంగుళాలు. బరువయితే కిలోల్లో అరవైఏడు. సర్వీస్ చేసిందంటే అదిరిపోవాలి. గాల్లోకి ఎగిరి బాల్ని కొట్టిందంటే గ్యారంటీగా పాయింటే. అటువంటి ఫ్రెండు

'మనకి' క్లోజ్‌ఫ్రెండ్ అయితే ఏ పిల్లకయినా కావల్సింది ఏముంటుంది? నా అదృష్టం దాని దురదృష్టం ఏమంటే ఇంగ్లీష్ అంటే దానికి పరమ భయం. నాకేమో ఇంగ్లీషంటే చేతిలో జాంకాయ. నాలాగే సూర్యకాంతం కూడా ఒంటికాయ శొంఠికొమ్మే. అంటే, వాళ్ళ అమ్మానాన్నలకి ఒక్కతే కూతురు. దానిదేమో వాళ్ళ అమ్మ పోలిక. ఆవిడ చాలా హైటూ వెయిటూ. వాళ్ళ నాన్న మాత్రం సన్నగా, ఓ మాదిరి మీడియం హైటుతో ఉండేవాడు సూర్యకాంతంలో ఓ గొప్ప గుణం ఉంది. అది చాలా శాంతస్వభావురాలు. ఒక్క భోజనం విషయంలో మాత్రం మహాభారీ. బత్తాయికాయంత లావుండే శనగపప్పు ఉండల్ని క్షణాల్లో లాగించేసింది. లెక్కచూస్తే పదిహేను. అంత ఫాస్ట్‌యీటర్‌ని నేనిప్పటిదాకా చూడలేదు. ఇడ్లీలయితే కనీసం పదిహేను.

"ఇన్నాళ్ళకి నాకు పోటీవచ్చే ఉజ్జీ దొరికింది" అన్నారు ఓసారి మా వేదాంతాచార్యులు మాస్టారు. ఆ రోజుల్లో 'సూర్యకాంతం' పేరుపెట్టాలంటేనే భయపడేవాళ్ళు. కారణం 'సినిమా సూర్యకాంతం'. మా సూర్యకాంతం మాత్రం మహా మంచిది. సీతాకాలానికీ సూర్యకాంతానికీ సంబంధం ఏమిటని మీరు అడగొచ్చు. సూర్యకాంతం అద్భుతమైన సింగర్. నిజం చెప్పాలంటే తెలుగు సినీపాటల్లోని మధురిమని నాకు పరిచయం చేసింది సూర్యకాంతమే. నేనేదో అప్పటికప్పుడు 'పాట' కట్టి పాడుకునేదాన్నిగానీ, 'పాట'లో 'లోతుల్ని' చూడగలిగేదాన్నికాదు. ఒక విధంగా అది నాకు గురవయింది.

పోస్టాఫీసుకెళ్ళాను. నారాయణ అనే రిక్షాపుల్లర్ తండ్రిగారికి ఉత్తరం వ్రాయాల్సివచ్చి పార్వతీశం, మధు, వెంకట్రావు సుభాష్ గాడూ జోగారావూ అందరూ అక్కడికొచ్చారు.

"ఏమిటీ కట్టగట్టుకుని వచ్చారూ?" అన్నా. ఉత్తరం పూర్తిచేసి పోస్టులో వేసి.

"నీ చేత ఉత్తరం వ్రాయించుకోవాలని వచ్చాం" అన్నాడు జోగ్గాడు.

"ఏంటీ? జోకా?" అన్నా.

"సీతా..! నిజంగాచెబుతున్నాం. వ్రాయి" ఓ పేపరు అంటే అరఠావు చేతికిచ్చి అన్నాడు వెంకట్రావు. 'ఏంట్రా' అనబోతూ ఆగిపోయా. అదివరకు అందర్నీ నేను ఏరా అనే పిలిచేదాన్ని. వాళ్ళు సీతా అనో ఏమే సీతా అనో పిల్చేవాళ్ళు. ఇప్పుడు నానోట్లోంచి 'ఏరా' 'ఒరేయ్' లాంటి శబ్దాలు రావట్లేదు. కారణం ఏమిటో నాకూ తెలీదు.

"విషయం చెప్పండి" సద్దుకుని అన్నాను.

"చెప్పేదేముందీ? పరీక్షలు దగ్గరపడుతున్నాయి. నువ్వసలు మాతో కలవటం మానేశావు. అంతేకాదు, అసలు మాకెన్ని మార్కులొస్తున్నాయి అని కూడా అడగట్లేదు. అందరం కలిసి రోడ్లమీద వల్లెవేసినంతకాలం నీతోపాటు మేమూ పాసయ్యాం. ఇప్పుడయితే ఏమవుతామో మాకే తెలీడంలేదు. పాకబడి బేచ్ వాళ్ళం పలచబడిపోయాం. నీకేం నువ్వు క్లెవర్‌వి. పాసౌతావు." ఉక్రోషంగా అన్నాడు పార్వతీశం. సడన్‌గా నాకళ్ళు వాలిపోయాయి. వాడు అన్నమాటలో ఒక్కటికూడా అసత్యంకాదు. అసలు నేను మామూలుగా ఎందుకుండకూడదూ?

"సారీరా.. ఇవేల్టినించే మన స్టడీస్ మొదలెడదాం. మరీ రోడ్డుమీద కాకుండా బాబూరావుగారి మామిడితోటలో చదువుకుందాం. అందరం పాసవుతామని నాదీ గ్యారంటీ!" అన్నాను.

"అమ్మ.. ఎన్నాళ్ళకి 'ఏరా' అని పిలిచావే సీతా. ఇప్పుడు హాయిగా ఉందనుకో" నవ్వాడు జోగ్గాడు.

ఏదీ అనుకున్నంత సులువుకాదు. ముఖ్యంగా ఆడదాని జీవితంలో. మావిడితోటలో మేం 'కంబైన్డ్ స్టడీ సాగిస్తున్న మూడోరోజునే అయిదారుగురు కుర్రాళ్ళు, ఓ అమ్మాయి 'రహస్యంగా' తోటలో కలుస్తున్నారనే వార్త ఊళ్ళో 'గుప్పు'మంది.

మనమీద పడ్డనింద ఊరంతా వినేదాకా, మనదగ్గరికి రాదనేది పరమసత్యం.

ఆరోజు సాయంకాలం నేను ఇంటికి వెళ్ళేసరికే మా అమ్మ చిందులు తొక్కుతోంది.

"ఏమే భడవకానా, మొగపిల్లల్తో మామిడితోపుల వెంట తిరుగుతున్నావటగా. అసలీవూళ్ళో మేం తలెత్తుకు తిరిగాలా లేదా" అని విరుచుకుపడింది. అప్పటిదాకా నాకీ విషయం తెలీదుకదా, అందుకే "మావిడితోటల వెంట తిరగట్లా. మావిడి చెట్టుకింద చదువుకుంటున్నాం. అదీ నీకు చిన్నప్పటినించీ తెలిసిన మగపిల్లలతోనే .. అంటే, మా పాకబడివాళ్ళతోనే" అన్నా.

"నోర్ముయ్. వెధవ పన్లు చెయ్యడంగాక మళ్ళీ ఏమీ తెలీనట్లు కూతలా?" మా అమ్మ అరిచింది.

"దాన్ని ఇంకొక్క మాటంటే దవడ పేలిపోతుంది" రౌద్రంగా అరిచాడు మా నాన్న. ఎప్పుడొచ్చాడో ఏమో నాకైతే తెలీదు. నిశ్చేష్టురాలై నిలబడింది మా అమ్మ. అసలు మా నాన్నకి అంత కోపం వస్తుందని నాకే తెలీదు. ఊహించనుకూడా లేదు.

*(మళ్ళీకలుద్దాం)*

Post your comments